GHMC hmda TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Happy 75th Independence Day
క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
మంగళవారం 07-07-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# ఓఆర్ఆర్‌పై ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి, ఐదుగురికి గాయాలు

హైదరాబాద్ శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం తెల్లవారుజామున ఓఆర్ఆర్ మీద ఆగివున్న లారీని ఓ కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా.. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒక మహిళ, చిన్నారి ఉన్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# నగరంలో చిరుజల్లులు

గ్రేటర్‌లోని శంషాబాద్, తుర్కయాంజల్, తొర్రూరు, షేక్‌పేట ఘాన్సీబజార్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. మరో వైపు ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. నిన్న మొన్నటి వరకు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోయిన ఉష్ణోగ్రతలు సోమవారం నాడు సాధారణ స్థాయి దాటి నమోదయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33.0 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.2 డిగ్రీలు, గాలిలో తేమ 64 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.






## హత్నూర గురుకులంలో దయనీయ దృశ్యాలు...

# మౌలిక సదుపాయాలు ఎక్కడ..?

- గురుకులంలో గోడు... చదువు కన్నా కాపలానే ఎక్కువ..!
- డైనింగ్ హాల్ లేదు.. వంటశాల లేదు.. విరిగిన డోర్లు.. హాస్టల్‌కు విద్యార్థులే కాపలా
- గురుకులాల్లో నాణ్యమైన విద్య అంటున్న ప్రభుత్వం...
- ఈ పరిస్థితులకు సమాధానం చెప్పాలి
- కోతుల బెడదతో భోజనం చేయాల్సిన పరిస్థితి
- పిల్లలు చదువుకోవాలా... లేక హాస్టల్‌కు కాపలా కాయాలా..?
- చెట్ల కిందే భోజనం, విరిగిన డోర్లు... ఇది గురుకులమా లేక నిర్లక్ష్యానికి నిదర్శనమా..?
- తల్లిదండ్రులే డబ్బులు వేసి పాఠశాల శుభ్రం చేయించడం సిగ్గుచేటు
- జిల్లా కలెక్టర్ వెంటనే పాఠశాలను సందర్శించి సమస్యలను పరిష్కరించాలి
- "పాఠశాల: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, హత్నూరు మండలం, సంగారెడ్డి జిల్లా
- విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:
- హాస్టల్ గదుల డోర్లు విరిగిపోవడం
- వస్తువుల చోరీలు జరగడం
- రోజూ ఇద్దరు విద్యార్థులు హాస్టల్‌కు కాపలా
- డైనింగ్ హాల్ లేక చెట్ల కింద భోజనం
- వంటశాల లేక ఇబ్బందులు
- వాష్‌రూమ్‌ల దయనీయ పరిస్థితి
- హాస్టల్ గదులకు కిటికీలు లేక చలి ఇబ్బందులు
- తల్లిదండ్రులే రూ.100 చొప్పున చందాలు వేసి పాఠశాల పరిసరాల శుభ్రత"

6లో









# చేనేత సహకార సంఘం పాలకవర్గం ఏకగ్రీవం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల చేనేత సహకార సంఘం పాలకవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. మొత్తం 13 మంది నామినేషన్లు దాఖలు చేయగా సోమవారం విత్ డ్రా సమయానికి నలుగురు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో పోటీలో 9 మంది మాత్రమే ఉండడంతో ఆ పాలకవర్గం ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి అయూబ్ నోటీసు బోర్డుపై జాబితాను ప్రదర్శించారు. ఏకగ్రీవం అయినా పాలకవర్గ సభ్యులు గంజి సుధాకర్ ,చెరుపల్లి శ్రీనివాసులు ,మిర్యాల వెంకటేశ్వర్లు ,కోట రాంబాబు ,మిర్యాల ప్రకాష్, ,వడ్డేపల్లి రాములు ,మిర్యాల నరేందర్ (వట్టిమర్తి),గంజి దేవకమ్మ ,సంగిశెట్టి చంద్రకళ ఏ ఒక్క నామినేషన్ అధికంగా ఉన్న ఈ నెల 10న ఎన్నికలు పోలింగ్ జరిగేది. పట్టణానికి చెందిన పద్మశాలి కుల పెద్దలు.. జిల్లా మనోహర్, చెరుపల్లి రామచంద్రం, గంజి వెంకటేశం, పున్న భూమయ్య, కుకుడాల గోవర్ధన్, జెల్లా సత్తయ్య, ఈపూరి యాదగిరి ఎన్నికలు జరగకుండా ఏకగ్రీవం అయ్యేందుకు గత వారం రోజులుగా చర్చలు జరిపి చివరికి అందరి ఆమోదంతో ఏకాభిప్రాయానికి వచ్చారు. దీంతో నామినేషన్ల



ఉపసంహరణ అనంతరం ఓటింగ్ లేకుండా అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారు. ఈ సందర్భంగా అందరినీ ఏకతాటిపై తీసుకువచ్చేందుకు తీవ్ర కృషి చేసిన కుల పెద్దలకు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 9న ఆఫీస్ బేరర్లను ఎన్నుకొనుటకు ఎన్నికల అధికారి సమావేశం నిర్వహించనున్నారు.

# టియుడబ్ల్యూజె (ఐజెయూ) ఆధ్వర్యంలో ఎంఈఓ కి వినతి...

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** ప్రైవేటు పాఠశాలలలో చదువుతున్న జర్నలిస్టు పిల్లలకి 50 శాతం ఫీజు రాయితీ ఇచ్చే విధంగా జిల్లా విద్యాధికారులు తక్షణమే ఫీజు రాయితీ సర్క్యులర్ను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిట్యాల మండల టియుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో మండల విద్యా వనరుల కేంద్రం ముందు నిరసన తెలియజేశారు. అనంతరం మండల విద్యాధికారి సైదా నాయక్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఏళ్ల బయన్న, మండల అధ్యక్షుడు మేండే వెంకన్న, ప్రధాన కార్యదర్శి పోకల కరుణాకర్, ఉపాధ్యక్షుడు ఏళ్ల వెంకన్న, సహాయ కార్యదర్శి కూనూరు మధు, గౌరవ సభ్యులు మిర్యాల ప్రకాష్, జిట్ట మల్లేష్, అమరోజు వెంకన్న, చికిలంమెట్ల మెహర్ బాబు, కాలిన శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు..





# ఓటర్ల జాబితా సవరణ వినియోగించుకోవాలి.

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో ఈరోజు ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా ఫారాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బి.ఎల్.ఓ లు చూపించిన విధంగా ప్రజలు తమయొక్క పూర్తి సమాచారాన్ని వ్రాసి తమ యొక్క బి.ఎల్.ఓ లకు అందజేలని ఈ రోజు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాంపు ను వినియోగించుకోవలని గ్రామ శాఖ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరు ఓటు హక్కు కల్పించేలా ఈ సర్ ఊపయోగపడుతుందని , గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని , ఓటర్లు ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జిపిఓ గోలి, గంట్ల తిరుమల్ రెడ్డి , చేకూరి గణేష్ , ఆవుల రాము ఏర్పుల వెంకటేష్ తెల్సూరి నరసింహా అనగంటి నరేష్ , జెల్లా ప్రశాంత్ , బి.ఎల్.ఓ గీత , సుజాత ,తదితరులు పాల్గొన్నారు.

# సాయిబండతాండలో సీసీటీవీ నిఘా కెమెరాల ప్రారంభం

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మండలంలోని కుదభక్షుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో, సాయిబండతాండ గ్రామంలో గ్రామ ప్రజల భద్రత కోసం, ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా కెమెరాలను, సోమవారం మర్రిగూడ ఎస్ఐ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాంబాబు గ్రామస్తులు, యువత, ప్రజా ప్రతినిధులతో మాట్లాడుతూ..సీసీటీవీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. దొంగతనాలను అరికట్టడంలో, గొడవలను నివారించడంలో, మహిళల, పిల్లల భద్రతను పెంపొందించడంలో, ఏదైనా సంఘటన జరిగినప్పుడు తక్షణ ఆధారాలు సేకరించడానికి, సీసీటీవీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కెమెరాల లైవ్ ఫుటేజీని గ్రామస్తులకు చూపించి అవగాహన కల్పించారు. కెమెరాలను ఎవరూ ధ్వంసం చేయవద్దని, గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు కానీ, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని



ఎస్ఐ సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధికారి ఎం. అనిల్, గ్రామ పెద్దలు పాండు పాల్గొన్నారు.



# బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి రూ.70 వేలు జరిమానా

**చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు**

**పాలకీడు మండల ఎస్ఐ కోటేష్**

**క్రైమ్ మిర్రర్, పాలకవీడు :** చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాలకవీడు మండల ఎస్ఐ కోటేష్ హెచ్చరించారు.పాలకవీడు మండలం ఎల్లాపురం గ్రామానికి చెందిన షేక్ హకీం తండ్రి మహబూబ్ అలీ అను అతడు కొద్ది రోజులుగా అదే గ్రామానికి చెందిన వివాహితను వేదిస్తుండగా అతనిపై పాలకీడు మండల ఎస్ఐ ఆర్. కోటేష్ కేసు నమోదు చేసి సత్ప్రవర్తన నిమిత్తం పాలకవీడు మండల తాశీల్దార్ ముందు బైండ్ ఓవర్ చేయనైనది, అయిన అతడి లో ఎలాంటి మార్పు రాకుండా మరలా అదే వివాహిత తో అసబ్యంగా ప్రవర్తించడముతో కేసు నమోదు చేసి జైలు కు పంపనైనదని అన్నారు. సత్ప్రవర్తన నియమం (బైండ్ ఓవర్) ను అతిక్రమించగ పాలకవీడు ఎస్ఐ పంపిన రిపోర్ట్ ఆదారముగా బైండ్ ఓవర్ ను అతిక్రమించినందుకు షేక్ హకీం కు రూ. 70,000జరిమానా విదించి కట్టించనైనదని తెలిపారు.

# ప్రతి ఇంటికి ఒక మొక్క-ప్రతి గుండెకు ఒక సంకల్పం

**సర్పంచ్ మిర్యాల వెంకటేశం**

**నేరడలో వన మహోత్సవం మొక్కల పంపిణీ**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం నేరడ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిర్యాల వెంకటేశం పాల్గొని మొక్కలు పంపిణీ చేసి అనంతరం మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఒక మొక్క, ప్రతి గుండెకు ఒక సంకల్పం ఉండాలి. మనం నాటే ప్రతి మొక్క భావితరాలకు మనం అందించే ఆస్తి. వర్షాలు కురవాలన్నా, కాలుష్యం తగ్గాలన్నా చెట్లను పెంచడమే ఏకైక మార్గం. పంపిణీ చేసిన మొక్కలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పెంచి సంరక్షించాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్యాల మహేందర్ గ్రామ కార్యదర్శి నామోజు సరిత, ఫీల్డ్ అసిస్టెంట్ వడ్డగాని రాధ,వార్డు సభ్యులు,కారోబార్ ముషం శ్రీనివాస్ గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఉమ్మడి పెబ్బేరు మండలంలో ఆకస్మికంగా తనకి

**ఓటర్ల నుండి పూరించిన పారాలను వెంటనే ఆన్లైన్లో చేయండి**

**ఆర్డిఓ సుబ్రహ్మణ్యం**

**వనపర్తి జూలై 6 క్రైమ్ మిర్రర్:** ఉమ్మడి పెబ్బేరు మండలం పూరించిన ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్ల నుండి తీసుకొని ఆన్లైన్ లో నమోదు చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని ఆర్డీఓ సుబ్రమణ్యం బి.ఎల్.ఓ లను ఆదేశించారు. ఓటర్ల నుండి పూరించిన ఫారాలను ఇంటింటికి తిరిగి తీసుకోవాలని, ఫారం నింపడం తెలియని ఓటర్లకు బూత్ లెవల్ ఆఫీసర్లు దగ్గరుండి సహాయం చేయాలని ఆర్డీఓ, ఓటరు నమోదు అధికారి సుబ్రమణ్యం బి.ఎల్. ఒ లను ఆదేశించారు. సోమవారం. ఆర్డిఓ సుబ్రహ్మణ్యం పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో పర్యటించి బూత్ లెవల్ అధికారులు, సూపర్వైజర్ల పనితీరును, జిల్లాలో ఎస్.ఐ.ఆర్ కొనసాగుతున్న ప్రక్రియను పరిశీలించారు. వనపర్తి శాసన సభ నియోజక వర్గంలో ఓటర్ జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ా×= చేయు విషయములో పెబ్బేర్ మండలం, రంగాపూర్, కంచిరావుపల్లి మరియు శ్రీరంగాపూర్ మండలములోని కంబాలాపూర్ గ్రామాలకు సంబందించిన పోలింగ్ స్టేషన్ నెం.222, 223, 225, 252, 253 మరియు 202 పోలింగ్ స్టేషన్ లను సందర్శించి బూత్ లెవల్ అధికారులు ఎన్యూమరేషన్ గణన ఫారం ఓటర్లు కు పంపిణి చేయుచున్న కార్యక్రమాన్నీ ఆకస్మికంగా తనిఖీ చేసారు.ద

# ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం

**మల్టీమీడియా. ఎలక్ట్రానిక్స్. ఇంజనీరింగ్ లో 42 సీట్లు ఖాళీ**

**ప్రిన్సిపాల్. జయచంద్ర**

**వనపర్తి జులై 6 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ మల్టీమీడియా అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో మిగిలిపోయిన-42 సీట్లకు ఈనెల 8వ తేదీ వరకు కళాశాలలో సంప్రదించి అడ్మిషన్ తీసుకోవాలని మహిళ కళాశాల ప్రిన్సిపాల్ . జయచంద్ర తెలిపారు. మహిళ విద్యార్థులు టి.జి. పాలిసెట్. 2026 లో ర్యాంక్ కార్డు. ఎస్.ఎస్.సి. మార్కుల మెమో, 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ట్రాన్స్ఫర్ సర్టిఫికేట్.టి.సి. క్యాస్ట్.ఇన్కమ్ సర్టిఫికెట్లతో తదితర.జిరాక్స్ లతో పాటు. స్పాట్ అడ్మిషన్ ఫీజు: 7000 రూపాయలు. విద్యార్థులు తీసుకురావాలని ఆయన తెలిపారు




# ఓటరు జాబితా సవరణ వేగవంతం చేయాలి : డిప్యూటీ తహశీల్దార్ అంజలిరెడ్డి

- ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణపై ఆకస్మిక తనిఖీలు
- క్షేత్రస్థాయిలో పనితీరును పరిశీలించిన అంజలిరెడ్డి
- జూలై 14లోపు ఎన్యుమరేషన్, ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలని ఆదేశం



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైనదని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించాలని డిప్యూటీ తహశీల్దార్ శ్రీమతి అంజలిరెడ్డి బూత్ లెవల్ అధికారులకు సూచించారు. తహశీల్దార్ ఆదేశాల మేరకు సోమవారం భూపాలపల్లి పట్టణంలోని పలు వార్డుల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ఈ నెల 14వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున ప్రతి బూత్ పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరికి ఫారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించాలని సూచించారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి ఆలస్యం చేయకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిర్ణీత గడువులోగా డేటా ఎంట్రీ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణలో ఎలాంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, బూత్ లెవల్ అధికారులు తమ పరిధిలోని బూత్ లెవల్ ఏజెంట్లు తో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి ఓటరికి సరైన సమాచారం అందేలా అవగాహన కల్పించి, అర్హులెవరూ జాబితా నుంచి మినహాయింపుకు గురికాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ తనిఖీ సందర్భంగా సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ చేరుతున్న ఓటరు నమోదు ప్రక్రియ..!!

**ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యానికి తావులేదు : బీఎల్ఓ సృజన్**

**ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి : సూరం మహేష్ రెడ్డి**

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోంది. గ్రామ బూత్ లెవల్ అధికారి సృజన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల సేకరణ, దరఖాస్తుల స్వీకరణ వంటి ప్రక్రియలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకుడు సూరం మహేష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తప్పకుండా ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే



ఓటరు జాబితాలో ఉన్న వారు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుని సరిదిద్దించుకోవాలని కోరారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు ప్రభుత్వం నిర్ణయించిన గడువులోగా ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని, ఎవరూ ఈ అవకాశాన్ని నిర్లక్ష్యం చేయవద్దని మహేష్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా సక్రమంగా ఉండటం వల్ల ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, బూత్ లెవల్ అధికారి సృజన్, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# 13న నులిపురుగుల నిర్మూలన దినం

**1.58 లక్షల మంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు**

**పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్**

**మంచిర్యాల, జూలై 6 (క్రైమ్ మిర్రర్):** జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ తెలిపారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు.జిల్లాలో ఒకటి నుంచి 19 ఏళ్లలోపు 1,58,480 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులతో పాటు గ్రామాల్లోని పిల్లలకు ఆశా కార్యకర్తల ద్వారా మాత్రలు వేయించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని 930 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.నులిపురుగుల వల్ల పోషకాహార లోపం, రక్తహీనత, శారీరక ఎదుగుదల, మానసిక వికాసంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని తెలిపారు. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అర మాత్ర, రెండేళ్ల నుంచి మూడేళ్లలోపు వారికి ఒక



మాత్రను పొడి చేసి, మూడు నుంచి 19 ఏళ్లలోపు వారికి ఒక మాత్రను నమిలి తినిపించాలని సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలు సురక్షితమైనవని, వాటిని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనే తినిపిస్తామని స్పష్టం చేశారు.భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి వినియోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులిపురుగుల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వాసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ భీష్మ, డాక్టర్లు శ్రీధర్, రవి, సుధాకర్ నాయక్, అరుణశ్రీ, అనిల్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డీపీఓ ప్రశాంతి, ఆర్ఎస్ పద్మ, సుమన్, సురేందర్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీలో మంత్రి వివేక్ వెంకటస్వామి మార్నింగ్‌వాక్

**ప్రజా సమస్యలపై ఆరా**

**రూ.80 కోట్లతో అభివృద్ధి పనులు.. డిసెంబరు నాటికి ఇంటింటికీ నల్లా నీరు**

**కాళేశ్వరం డిజైన్ కమిషన్ల కోసమే మార్చారని బీఆర్ఎస్‌పై విమర్శలు**



**రామకృష్ణాపూర్ జూలై 6 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. సోమవారం ఉదయం 9వ వార్డులో స్థానిక నాయకులతో కలిసి మార్నింగ్‌వాక్ నిర్వహించిన ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇచ్చిన హామీల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 9వ వార్డులోనే రూ.4.80 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో ఈ పనులు వంద శాతం పూర్తవుతాయని భరోసా ఇచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం, బిల్డర్ల బాధ్యతారాహిత్యం కారణంగా కాలనీల్లో రోడ్లు, డ్రైన్లు సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత క్యాతనపల్లి మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించి సుమారు రూ.80 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. ఈ ఏడాది చివరి నాటికి అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు పూర్తవుతాయని చెప్పారు. అమృత్ పథకం కింద రూ.40 కోట్లతో తాగునీటి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, డిసెంబరు నాటికి ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు అందించే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని పేర్కొన్నారు.

**'కేటీఆర్‌కు అవగాహన లేదు'**

కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించిన బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి, 60 వేల మందితో ముట్టడి చేసి పంపులు నడుపుతామనడం అవగాహన లేమికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎన్ని టీఎంసీల నీటిని వినియోగించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన ప్రాజెక్టు ద్వారా కేవలం 70 టీఎంసీల నీటినే పంప్ చేశారని, అది కూడా ఎల్లంపల్లి నుంచి విడుదలైన నీరేనని ఆరోపించారు. దీంతో ప్రజలపై కోట్ల రూపాయల విద్యుత్ బిల్లుల భారం పడిందన్నారు. గతంలో కాకా వెంకటస్వామి ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును రూ.36 వేల కోట్లతో గ్రావిటీ విధానంలో రూపొందించారని, అయితే కేసీఆర్ కుటుంబం కమిషన్ల కోసమే తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరానికి ప్రాజెక్టును మార్చి రీడిజైన్ పేరుతో తుగ్లక్ నిర్ణయాలు తీసుకుందని విమర్శించారు. లక్షల కోట్ల అప్పులకు కేసీఆర్ కుటుంబమే బాధ్యత వహించాలని అన్నారు.

**'చెన్నూరు రైతులకు న్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే'**

కాళేశ్వరం బ్యాక్‌వాటర్ కారణంగా చెన్నూరు నియోజకవర్గంలో 40 వేల ఎకరాల పంట నష్టపోతోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూసేకరణ కింద లక్ష్మీపూర్ రైతులకు ఇవ్వాల్సిన రూ.33 కోట్ల పరిహారాన్ని నిలిపివేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆ నష్టపరిహారం అందించి రైతులకు న్యాయం చేశామని తెలిపారు. హరీశ్‌రావు చెన్నూరు నియోజకవర్గంపై అనవసరంగా దృష్టి సారిస్తున్నారని విమర్శించిన మంత్రి, సిద్దిపేటలో ప్రజా సమస్యలు లేక సమీక్ష సమావేశాల్లో నోట్‌బుక్కులు, పేపర్ల వంటి చిన్న అంశాలపై మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో సిద్దిపేటలో కూడా బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తప్పదని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వోద్నాల శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# అనుమతులు లేని పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో విద్యాధికారులు విఫలం...
- విద్యా ప్రమాణాల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం స్పందించాలి...
- సమయపాలన పాటించని ప్రాథమిక పాఠశాల సిబ్బంది....
- ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల వినతి

**చౌటుప్పల్,జులై 6,క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. చౌటుప్పల్ మండల పరిధిలో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించడం, ఒకే అనుమతితో బహుళ పాఠశాలలను నడపడం, భవన అనుమతులు లేకుండా విద్యాసంస్థలను కొనసాగించడం, అవసరమైన గుర్తింపులు లేకుండానే తరగతులు నిర్వహించడం, అధిక ఫీజులు వసూలు చేయడం వంటి తీవ్రమైన అక్రమాలకు పాల్పడుతున్నాయని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్ణీత సమయానికి తెరుచుకోకపోవడంతో చిన్నారులు చాలా సేపు పాఠశాల బయటే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణలో ఎంఈఓ పూర్తిగా విఫలమయ్యారని, ఈ ఘటనపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేకంగా ఫిర్యాదు చేశారు. ఈ అంశాలపై గత కొంతకాలంగా ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాలు, అధికారులను కలిసి ఫిర్యాదులు చేసినప్పటికీ మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారు లు ఎలాంటి చర్యలు తీసుకోకుండా విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ అక్రమాలు యథేచ్ఛగా



కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా స్థాయి ప్రత్యేక విచారణ కమిటీని నియమించి, అక్రమాలకు పాల్పడిన విద్యాసంస్థలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎంఈఓ, డీఈఓలపై విచారణ జరిపించి నిర్లక్ష్యం నిర్ధారణ అయితే సస్పెండ్ చేసి శాఖాపరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా ప్రమాణాల పరిరక్షణ కోసం జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు వీరమల్ల కార్తీక్ గౌడ్, దిండు భాస్కర్, నలపరాజు రమేష్, ఒంటెద్దు లింగస్వామి, వినయ్ రెడ్డి, ఊదరి రాకేష్, గంగాదేవి శివ, అత్తు, సాయి వంశీ, శైలేందర్, రామకృష్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# చీపునుంతల గ్రామంలో ఎస్ ఐ ఆర్ పై అవగహన

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంపై తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. చీపునుంతల గ్రామం, బూత్ నంబర్--23 పరిధిలో శుక్రవారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్, జిపిఓ భాగ్యలక్ష్మి పాల్గొని ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై, ఎమ్యూనరేషన్ ఫారం నింపడంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ వారం నీ పదం లో ఎలాంటి తప్పులు చేసిన ఇబ్బందులు పడాల్సి వస్తుందని, భవిష్యత్తులో ఓటును కోల్పోయే ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఫారం నింపాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బండి రఘుపతి, బి ఎల్ ఓ పుష్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పి.ఆర్.సి వెంటనే ప్రకటించాలి

**ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్**

**చౌటుప్పల్,జులై 6, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మండలంలోని వివిధ పాఠశాలలలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షులు బోయ రాములు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటికాల రవీందర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పి ఆర్ సి రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని అలాగే ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులు హైయర్ ఎడ్యుకేషన్ చేయుటకు సంబంధించిన జి. ఓ 342 అమలుకు అడ్డంకిగా ఉన్న మెమో నెంబర్ 26659 ను రద్దు చేయాలని కోరారు. అలాగే పదోన్నతులలో అడ్డంకిగా ఉన్న ఆడక్వసీ అనే పదాన్ని రద్దు చేసి ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయులకు పదోన్నతుల కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దుబ్బాక యాదయ్య, చౌటుప్పల మండల అధ్యక్షులు జనపాల కిషన్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు భార్గవి, ఎస్ దుర్గయ్య, మేడి యాదయ్య, కే. మహేశ్వరి, జి.యశోద, ఈ. శ్వేత తదితరులు పాల్గొన్నారు.





## అభివృద్ధితో ప్రజల గుండెల్లో నిలిచిపోయిన కేసీఆర్ : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్, మీర్‌పేట్ డివిజన్ పరిధిలోని మంత్రాల చెరువులో విస్తారంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క (వాటర్ హైసింథ్) కారణంగా దుర్వాసన వెదజల్లుతూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, చెరువులో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమానికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, చెరువులో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి, భవిష్యత్తులో మురికి నీరు చెరువులోకి చేరకుండా అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెరువుల పరిరక్షణ ప్రజారోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ఎంతో కీలకమని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కోట్ల రూపాయలతో అందంగా అభివృద్ధి చేసిన చెరువులు నేడు ప్రభుత్వ నిర్లక్ష్యంతో మురికికూపాలుగా మారుతున్నాయి. కేసీఆర్ పేరు చెరిపివేయాలనే ప్రయత్నాలు ఎంత చేసినా, ఆయన చేసిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికీ మరవరు. కేసీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అర్కల భూపాల్ రెడ్డి, దీప్లాల్ చౌహాన్, అనిల్ యాదవ్, అర్కల కామేష్ రెడ్డి, దిండు భూపేష్ గౌడ్, రాజ్ కుమార్, మదారి రమేష్, శీను నాయక్, గోపి యాదవ్, ప్రభాకర్ రెడ్డి, అవినాష్, వీర రాఘవరెడ్డి, సునీత బాలరాజ్, పంతంగి మాధవి, బిందు, నిర్మలారెడ్డి తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా, జిహెచ్ఎంసి 60వ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీ, దాసరి నారాయణరావు నగర్ కాలనీ రోడ్డులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలతో ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఆయన దేశానికి చేసిన సేవలను, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ యొక్క కార్యక్రమానికి నాయకులు అరకల భూపాల్ రెడ్డి, ఏనుగుల అనిల్ కుమార్ యాదవ్, మాధరి రమేష్, రాజ్ కుమార్, గోపి యాదవ్, కమిటీ సభ్యులు లప్ప లక్ష్మణ్, పోతురాజు బాలకృష్ణ, గోపిరెడ్డి సాయి తదితరులు పాల్గొన్నారు.



# మహనీయులకు ఘన నివాళులు

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి మరియు స్వతంత్ర సమరయోధులు బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా డివిజన్ అధ్యక్షులు తులసి ముకేష్ ముదిరాజ్ మరియు ప్రధాన కార్యదర్శులు సిద్దాల శ్రీనివాస్, కసిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లెలగూడ లోని స్వాగత్ గ్రాండ్ దగ్గర శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం అలాగే మీర్పేట్ చౌరస్తా లో ఉన్న బాబు జాగ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షులు తులసి ముకేష్ ముదిరాజ్ మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా కొనియాడారు. డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చూపిన దేశభక్తి మార్గం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. బాబు జగ్జీవన్ రామ్ భారతదేశపు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక సంస్కర్త మరియు దిగ్గజ రాజకీయ నాయకుడు, ఆయనను దేశవ్యాప్తంగా "బాబూజీ" అని ఆప్యాయంగా



పిలుచుకుంటారనీ, భారత రాజకీయాలలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, దళితుల హక్కుల సాధనకు ఆయన చేసిన సేవలు ఎనలేనివి అని అధ్యక్షులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చ నాయకులు సుల ప్రభాకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ సోమేశ్వర, గాజుల మధు, మాజీ కార్పొరేటర్ మద్ది రాజశేఖర్ రెడ్డి, మేకల రవీందర్ రెడ్డి, గౌరీ శంకర్ సీనియర్ నాయకులు కాశీరాం యాదవ్, జగన్ ముదిరాజ్, వేణు గోపాల్ రెడ్డి, మల్లికార్జున్, హైందవి రెడ్డి, వంటేరు నరసింహ రెడ్డి, సందీప్, శ్రీశైలం యాదవ్, నరసింహ, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో ప్రజల సమస్యలు స్వీకరించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణకు అధికారులకు ఆదేశాలు**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 06:** సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, సంబంధిత పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని



సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా పోలీసు కార్యాలయం ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తోందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో 66 వినతులు స్వీకరణ**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 06:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ప్రతి ఫిర్యాదును సత్వరంగా, పారదర్శకంగా పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా డివిజన్ల వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 66 ఫిర్యాదులు అందాయి. వాటిలో జిల్లా కలెక్టరేట్‌లో 35, సంగారెడ్డి డివిజన్‌లో 13, ఆందోల్ డివిజన్‌లో ఏ ఫిర్యాదు లేదు, నారాయణఖేడ్ డివిజన్‌లో 6, జహీరాబాద్ డివిజన్‌లో 12 ఫిర్యాదులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# హత్నూర గురుకులంలో దయనీయ దృశ్యాలు... మౌలిక సదుపాయాలు ఎక్కడ..?






**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 06:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం గురుకుల విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఈ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ గదుల డోర్లు పూర్తిగా విరిగిపోయినా వాటి మరమ్మతులు చేపట్టలేదని విద్యార్థులు చెబుతున్నారు. దీంతో హాస్టల్‌లోని విద్యార్థుల వస్తువులు తరచూ చోరీకి గురవుతున్నాయని, చోరీలను అరికట్టేందుకు ప్రతిరోజూ ఇద్దరు విద్యార్థులు వంతుల వారీగా హాస్టల్‌కు కాపలా కాయాల్సి వస్తోందని తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాల్సిన సమయంలో భద్రత బాధ్యతలు నిర్వర్తించడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. పాఠశాలలో డైనింగ్ హాల్, వంటశాల లేకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద భోజనం చేయాల్సి వస్తోందని సమాచారం. భోజనం చేసే సమయంలో కోతుల బెడద కూడా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. వాష్‌రూమ్‌ల పరిస్థితి కూడా దయనీయంగా ఉందని, హాస్టల్ గదులకు కిటికీలు లేక చలికాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో అధికారుల నిర్లక్ష్యంపై విసిగిపోయిన తల్లిదండ్రులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున చందాలు వేసుకుని పాఠశాల పరిసరాలను శుభ్రం చేయించినట్లు తెలిపారు. పరిస్థితులు మెరుగుపడకపోవడంతో కొంతమంది విద్యార్థులు ఇతర పాఠశాలలకు టీసీలు తీసుకుని వెళ్తున్నట్లు సమాచారం. హత్నూర గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా కలెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు వెంటనే పరిశీలించి, డైనింగ్ హాల్, వంటశాల, హాస్టల్ గదుల మరమ్మతులు, వాష్‌రూమ్‌ల అభివృద్ధి, భద్రతా ఏర్పాట్లు వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

# నాడు మంజూరైన నిధులను విడుదల చేసి నిలిచిపోయిన పనులను పూర్తి చేయండి

**అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్, నాదర్‌గుల్ 57వ డివిజన్ పరిధిలోని గుర్రంగూడ ఆదిత్య నగర్ కాలనీలో 20 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహేశ్వరం నియోజకవర్గంపై కక్షసాధింపు ధోరణితో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులను అడ్డుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అలాగే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ప్రతి కార్పొరేషన్‌కు 50 కోట్ల నిధులు, మున్సిపాలిటీలకు 25 కోట్ల చొప్పున కేటాయించి, సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఆ నిధులు నిలిపివేశారని ప్రస్తుతం ఆ నిధులను విడుదల చేయకుండా నిలిపివేయడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడం మానుకుని, ఆనాడు మంజూరైన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసి, పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుర్రం సాయికిరణ్ రెడ్డి, ముత్యం రెడ్డి, రామిడి రామిరెడ్డి, సత్తిరెడ్డి పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు , కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# మియాపూర్ మంగళవారం సంతకు అధికారిక అనుమతి



**మియాపూర్ క్రైమ్ మిర్రర్ :** మియాపూర్ మంగళవారం సంత నిర్వహణకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సీ ఎమ్ సీ నుంచి అధికారిక అనుమతి లభించింది. రేపటి నుంచి ప్రతి మంగళవారం సంత అధికారిక అనుమతులతో యథావిధిగా నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , కంటెస్టెడ్ ఎమ్మెల్యే,రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ , సీఎంసీ కమిషనర్ సృజన , సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు సహకరించిన ప్రతి ఒక్కరికీ మార్కెట్ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో బోయిని మహేష్ యాదవ్, అడ్వకేట్ కిషోర్ యాదవ్, లక్ష్మణ్, రాధాకృష్ణ యాదవ్, గణేష్ ముదిరాజ్, దేవేందర్ గారు, మార్కెట్ కమిటీ సభ్యులు, వ్యాపారులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియ ద్వారా ఓటు హక్కును పరిరక్షించుకోండి : మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్ డివిజన్ లో జరుగుతున్న సర్ ప్రక్రియను పర్యవేక్షించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు బాలింగని జంగయ్య, గిరికటి కృష్ణంరాజు గౌడ్, నిరుడు శ్రీరాములు తదితరులు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ ప్రజలందరూ ఈ సర్ ప్రక్రియలో పాల్గొని తమ తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని అన్నారు. బి ఎల్ వో లను సంప్రదించి వారి వద్ద ఉన్న అప్లికేషన్ ఫారాలను తీసుకొని వాటిలో వివరాలు నింపి వారికి అందజేసినట్లయితే వారు అప్లికేషన్ ను దాని వివరాలను వెబ్ సైట్ లో పెట్టడం జరుగుతాయని అన్నారు. తప్పకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కు విషయంలో అప్రమత్తంగా ఉండి బిఎల్ఓ ల ద్వారా నమోదు చేయించుకోవాలని అన్నారు.

# సర్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోండి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్‌పేట్ సర్కిల్ నాదర్‌గుల్ డివిజన్ అల్మాస్ గూడ పరిధిలోని తిరుమల నగర్‌లో బి ఎల్ ఓ లతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను ప్రజలకు అందజేయడంతో పాటు, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం యొక్క ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించిన బోయపల్లి రాఘవేందర్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి అర్హుడైన పౌరుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా బి ఎల్ ఓలను సంప్రదించి అవసరమైన వివరాలు తెలుసుకుని, గడువులోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించాలని బోయపల్లి రాఘవేందర్ రెడ్డి కోరారు.






# ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలి

**విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి**

**ఎస్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పర్వత్ రెడ్డి పిలుపు**

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న వేతన సవరణ (పీఆర్సీ)ని రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రకటించాలని ఆల్ ఇండియా స్టేట్ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్టీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మరింత చిత్తశుద్ధితో వ్యవహరించి, పెండింగ్‌లో ఉన్న అన్ని డిమాండ్లను దశలవారీగా అమలు చేయాలని కోరారు. సోమవారం ఎస్ టి యు ఆధ్వర్యంలో కొల్లాపూర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ విద్యాభివృద్ధికి, విద్యా వ్యవస్థ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నప్పటికీ, వారి న్యాయమైన హక్కులు, సేవా ప్రయోజనాలు, వేతన సవరణ వంటి కీలక అంశాలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించాలని, అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇతర సేవా సంబంధిత సమస్యలను కూడా అత్యవసరంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యా ప్రమాణాల పెంపులో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, నాణ్యమైన విద్య అందించేందుకు వారు నిరంతరం శ్రమిస్తున్నారని పర్వత్ రెడ్డి కొనియాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం, సేవా భద్రత, ఉద్యోగ హక్కుల పరిరక్షణ జరిగితేనే ప్రభుత్వ విద్య మరింత బలోపేతం అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎస్ టి యు సభ్యత్వ నమోదు కార్యక్రమం కేవలం సభ్యుల సంఖ్యను పెంచే కార్యక్రమం కాదని, ఉపాధ్యాయుల ఐక్యతకు, సంఘ బలోపేతానికి, హక్కుల సాధనకు బలమైన వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు స్వచ్ఛందంగా సభ్యత్వం నమోదు చేసుకుని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సంఘం బలంగా ఉంటేనే ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్లి పరిష్కారం సాధించగలమని అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించిందని సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పలు విద్యా, సేవా సంబంధిత అంశాలపై నాయకులు చర్చించి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, జిల్లా పూర్వ అధ్యక్షుడు ఎస్. మురళి, కొల్లాపూర్ మండల అధ్యక్షుడు వరప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి చంద్రుడు, సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యంలో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేతుల మీదుగా ఉచిత గొడుగుల పంపిణీ

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేర్లింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత గొడుగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీ చైర్మన్, శేర్లింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మహిళలకు తన చేతుల మీదుగా ఉచిత గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ, ప్రజల అవసరాలను గుర్తించి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు మిరియాల ప్రీతమ్‌ను అభినందించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళలకు గొడుగులు అందించడం అభినందనీయమైన కార్యక్రమమని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ... ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి అవసరాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం



తమ బాధ్యత అని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిరియాల రాఘవరావు ,రజిని, కవిత, సంగీత, ఆశ, త్రిలోచ , మహిళలు తదితులు పాల్గొన్నారు.

# రెక్కలు వచ్చిన ధరలు.. కనిపించని నియంత్రణ

**గ్రామాల్లో ని కిరాణా షాపుల దోపిడీ**

**క్రైమ్ మిర్రర్ పాలేరు :** ఉదయాన్నే కూలీకి వెళ్లే కూలీ.. సాయంత్రం ఇంటికి వచ్చి కిలో పప్పు, అరలీటర్ నూనె కొందామంటే జేబు ఖాళీ అవుతోంది. బియ్యం ధర, కూరగాయల ధర, కిరాణా ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీనికి తోడు కొలతల్లోనూ మోసం. అడిగే వారు లేరు, చెప్పే వారు లేరు. ఇదే నేడు నేలకొండపల్లి మండల పరిధిలోని గ్రామాల్లో నిత్యం కనిపిస్తున్న దృశ్యం.

**ఆకాశాన్నంటుతున్న ధరలు**

గత కొన్ని నెలలుగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. పట్టణాల్లో ఒక రేటు, గ్రామాల్లో మరో రేటు. కిరాణా షాపు యజమానులు తమ ఇష్టానుసారం ధరలు నిర్ణయిస్తున్నారు.

పప్పు, నూనె, పంచదార, సబ్బులు.. ఏ వస్తువు తీసుకున్నా ఎంఆర్‌పి కంటే రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. “ఈ రేటుకే తీసుకోవాలి. తీసుకోకపోతే లేదు” అని నిలదీసి మాట్లాడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కరువు, పంట నష్టాలతో అల్లాడుతున్న కష్టజీవులపై ఇది మరో పెనుభారం.

**త్రాసులోనూ మోసం - కనిపించని అధికారులు**

ధరల దోపిడీ ఒక్కటే కాదు. చాలా కిరాణా దుకాణాల్లో త్రాసులు, బరువుల కొలతలు సరిగా లేవు. కిలోకు 100 గ్రాములు తక్కువ కొలుస్తున్నా ప్రశ్నించే వారు లేరు.

ధరల నియంత్రణ, కొలతల తనిఖీ బాధ్యత ఉన్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పౌరసరఫరాల శాఖ అధికారులు నెలల తరబడి గ్రామాల వైపు రావడం లేదు. వారి నిర్లక్ష్యమే వ్యాపారులకు అలుసుగా మారింది. తనిఖీలు లేవు, జరిమానాలు లేవు.. దీంతో కిరాణా షాపులు “దోపిడీ కేంద్రాలు”గా మారాయి.



**అమాయక ప్రజల గోడు**

రోజుకు రూ.400, రూ.500 సంపాదించే వ్యవసాయ కూలీ, నిర్మాణ కార్మికుడు.. నెల జీతం మొత్తం కిరాణాకే సరిపోతోంది. పిల్లల చదువులు, ఇంటి ఖర్చులు ఎలా చూసుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేయాలన్నా “ఎవరు వింటారు? ఎవరు వస్తారు?” అనే నిస్పృహ ప్రజల్లో ఉంది. వ్యాపారుల దోపిడీకి, అధికారుల నిర్లక్ష్యానికి అమాయక జనం బలవుతున్నారు.

**-పరిష్కారం ఏమిటి?**

ఆకస్మిక తనిఖీలు:జిల్లా కలెక్టర్, పౌరసరఫరాల అధికారులు వెంటనే మండలంలోని ప్రతి గ్రామంలోని కిరాణా షాపులపై ఆకస్మిక దాడులు చేయాలి. ధరల జాబితా: ప్రతి షాపు ముందు నిత్యావసరాల ధరల జాబితాను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలి. త్రాసుల తనిఖీ: లీగల్ మెట్రాలజీ అధికారులతో త్రాసుల కొలతలను పరిశీలించి, తప్పుడు త్రాసులు స్వాధీనం చేసుకోవాలి.ప్రజా ఫిర్యాదు వ్యవస్థ: 1967 టోల్‌ఫ్రీ నెంబర్, జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్లను ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలి.ప్రభుత్వం “పేదల సంక్షేమం” అని చెబుతుంది. కానీ పేదవాడి కడుపు కొట్టే ఈ దోపిడీని అరికట్టకపోతే ఆ మాటలకు అర్థం ఉండదు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. లేకుంటే ప్రజలే కలిసి రోడ్డెక్కి తమ గొంతు వినిపించాల్సి వస్తుంది. “ఆకలి చావుల కంటే, దోపిడీ చావు ఎక్కువ బాధిస్తుంది” - ఇది నేడు నేలకొండపల్లి గ్రామాల్లో వినిపిస్తున్న ప్రతి కుటుంబం గొంతు.

# దేశ సమగ్రత కోసం పోరాడిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** జనసంఘ వ్యవస్థాపకులు, జాతీయవాది, విద్యావేత్త డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా భారతీయ జనతా రాష్ట్ర పార్టీ నాయకులు కోలన్ శంకర్ రెడ్డి, కార్యకర్తలు అంజనీకుమార్, కొమురయ్య, దేవేందర్ రెడ్డి, జ్ఞనేశ్వర్ సత్యనారాయణ పాల్గొని డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, దేశ సమైక్యత, జాతీయత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన విశిష్ట సేవలను, దేశ సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడిగా కొనియాడారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కొలను శంకర్ రెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చూపిన దేశభక్తి మార్గం నేటి తరానికి ఆదర్శమని, ఆయన ఆశయాలను ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టి, దేశ సేవనే పరమావధిగా భావిస్తూ ప్రజలకు సేవ చేయాలని పిలుపునిచ్చారు.



# "ఏక్ దేశ్ మే దో నిషాన్ నహీ చలేంగే" - డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ స్ఫూర్తి

అనంతు ఉపేందర్ గౌడ్

నేలకొండపల్లిలో డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు - బీజేపీ నివాళులు



**క్రైమ్ మిర్రర్ పాలేరు:** భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, దేశ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన మహనేత డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతిని నేలకొండపల్లిలో ఘనంగా నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు అనంతు ఉపేందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అనంతు ఉపేందర్ గౌడ్ మాట్లాడుతూ డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ త్యాగాన్ని కొనియాడారు. "డా. శ్యామ ప్రసాద్ ముఖర్జీ కేవలం 33 ఏళ్ల వయసులోనే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయస్కుడైన వైస్-ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టి విద్యా రంగంలో సంస్కరణలు తెచ్చారు. బెంగాల్ విభజనను అడ్డుకుని పశ్చిమ బెంగాల్‌ను భారత్‌లో ఉంచడంలో కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్యం తర్వాత మొదటి మంత్రివర్గంలో పరిశ్రమలు మరియు సరఫరాల శాఖ మంత్రిగా దేశ పారిశ్రామిక విధానానికి పునాది వేశారు" అని తెలిపారు. నెహ్రూ-లియాఖత్ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేసిన మొదటి వ్యక్తి ఆయనేనని, ఆ తర్వాత 1951లో ఆరెస్సెస్ మద్దతుతో

**"భారతీయ జనసంఘ్"**

ను స్థాపించారని చెప్పారు. అదే పార్టీ నేడు భారతీయ జనతా పార్టీగా ఎదిగిందన్నారు. "ఏక్ దేశ్ మే దో విధాన్ దో ప్రధాన్ ఔర్ దో నిషాన్ నహీ చలేంగే"అంటూ ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ పర్మిట్ లేకుండా కాశ్మీర్‌లో అడుగుపెట్టి 1953 జూన్ 23న అనుమానాస్పద స్థితిలో మరణించారని గుర్తు చేశారు. భారత సమగ్రత కోసం ప్రాణత్యాగం చేసిన అపర దేశభక్తుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బి జె పీ సీనియర్ నాయకులు భవనాసి దుర్గారావు మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు ఉపాధ్యక్షులు పురాణం దివాకర్, కొండా హర్షవర్ధన్ నాయకులు సూరెపల్లి జ్ఞానరత్నం షేక్ షర్ఫుద్దీన్ సయ్యద్ మోహినూద్దీన్ గెల్లా చక్రపాణి ఎలిగేటి గిరి పుట్టా సత్యనారాయణ పిట్టల సూరిబాబు తేజావత్ నాగరాజు కాళంగి వెంకటేశ్వర్లు గెల్లా నాగసాయి, బానోత్ శ్రీనివాసరావు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసంతో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** పోలీస్ ఉద్యోగార్థులు ఆత్మవిశ్వాసమే ఆయుధంగా తమ లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సూచించారు. కల్వకుర్తి పట్టణ కేంద్రంలో గత 68 రోజులుగా నిర్విరామంగా కొనసాగిన ఉచిత పోలీస్ కోచింగ్ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే పోలీస్ నియామక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలని ఆకాంక్షించారు. శిక్షణతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసమే విజయానికి పునాదులని పేర్కొంటూ, ప్రతి అభ్యర్థి లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే బాధ్యతతో పాటు సమాజానికి సేవ చేసే గొప్ప అవకాశమని అన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే ప్రణాళికాబద్ధమైన చదువు, శారీరక దృఢత్వం, సమయపాలన, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని తెలిపారు. గత 68 రోజులుగా శిక్షణ తరగతులను క్రమం తప్పకుండా సద్వినియోగం చేసుకున్న అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించి, ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలు, మెథడ్స్ వారి ఉద్యోగ సాధనలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు ఉచిత స్టడీ మెటీరియల్ కూడా అందించి తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శేఖర్ తో పాటు శిక్షణ పొందిన నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# యరగండ్లపల్లిలో ఎస్ఐఆర్ పై అవగాహన కార్యక్రమం

పలు సూచనలు చేసిన సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్.



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** మర్రిగూడ మండలంలో ఎస్ఐఆర్ 2026 ప్రక్రియను, ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ మున్నయ్య ఆధ్వర్యంలో, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 241, 242 పోలింగ్ కేంద్రాలను అధికారులు స్వయంగా సందర్శించి, ప్రక్రియ అమలు తీరును పరిశీలించారు. ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో సవరించే ప్రక్రియ ఇది. ఇందులో, మరణించిన వారి పేర్ల తొలగింపు, చిరునామా మార్పులు, డూప్లికేట్ పేర్ల తొలగింపు వంటి అంశాలు ఉంటాయి. ప్రతి ఇంటికి వెళ్లి బీఎల్‌ఓలు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారు. ఆ ఫారాలను సక్రమంగా నింపి తిరిగి అందజేయాలని ప్రతి బీఎల్ఓ బాధ్యతగా పని చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యరగండ్లపల్లి సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ దాని ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండాలని, అందుకే ఈ అవకాశాన్ని ఎవరూ వదులుకోవద్దని కోరారు. ఫారం రాగానే సక్రమైన సమాచారంతో నింపి బీఎల్‌ఓలకు అందజేయాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజాస్వామ్య బలోపేతానికి, ఈ ప్రక్రియ దోహదపడుతుందని ఆయన అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఓలు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్, ప్రక్రియను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఎవరికైనా సందేహాలు ఉంటే వెంటనే బీఎల్‌ఓలను సంప్రదించాలని వారు సూచించారు.



# కొత్తగా వచ్చిన ఎస్ఐ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం నాయకులు

**క్రైమ్ మిర్రర్ పాలేరు:** నేలకొండపల్లి కి కొత్తగా వచ్చిన యస్ఐ శ్రీనివాసరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి చాలువా కప్పి మిఠాయిలు పంచడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు నూక హనుమంతరావు తీగ వెంకటేశ్వర్లు కోలేటి మస్తాన్ రావు వీసం శ్రీనివాసరావు కోర్లకుంట కిరణ్ ఏలుగురి వీరబాబు తదితరులు పాల్గొన్నారు

# ప్రాథమిక పాఠశాల వంట సిబ్బంది తీరుపట్ల మున్సిపల్ చైర్మన్ అసహనం

వంట సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఫిర్యాదు

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట సిబ్బంది తీరు పట్ల మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అసహనం వ్యక్తం చేశారు. సోమవారం కల్వకుర్తి మున్సిపాలిటీ 18వ వార్డులోని ప్రాథమిక పాఠశాలను వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్, స్థానిక వార్డు కౌన్సిలర్ నాజియా మక్బూల్ లతో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసే సిబ్బంది విధుల పట్ల తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కల్వకుర్తి మండల విద్యాశాఖ అధికారి శంకర్ నాయక్ కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వంట చేయకుండా మధ్యాహ్న భోజన వంట సిబ్బంది తమ ఇష్టం వచ్చినట్లుగా ఆహారం తయారు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన వంట సిబ్బంది ఇష్టారాజ్యం వల్ల నిరుపేద విద్యార్థులకు సరైన భోజనం అందక ఆకలితో ఇబ్బంది పడుతున్నారని నాణ్యత లేని ఆహారం వల్ల వారి ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో, ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మధ్యాహ్న భోజన వంట సిబ్బందిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట సిబ్బంది ఇష్టారాజ్య వ్యవహారంపై మండల విద్యాధికారి శంకర్ నాయక్ స్పందిస్తూ తక్షణమే ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల భోజన విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న మధ్యాహ్న భోజన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సోఫీ, దున్న సురేష్, పడకంటి వెంకటేష్, మహేష్, తదితరులు ఉన్నారు.

